క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీల్లో సత్తా



విద్యార్థులతో కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్

సుల్తానాబాద్: పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ సాఫ్ట్, బేస్‌బాల్ పోటీల్లో ముగ్గురు విద్యార్థులు సత్తా చాటారని ఐపీఎస్ కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఆయన విద్యార్థులను అభినందించారు. డిసెంబర్ 24, 25, 26 తేదీల్లో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగిన 9వ సాఫ్ట్ బేస్‌బాల్ సబ్ జూనియర్స్, యూత్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎస్.నిఖిల్, శ్రీయాన్ వర్షిత్, సీహెచ్ వర్షిత్ రజత పతకం సాధించారు. కాగా వీరిని పాఠశాల చైర్మన్ సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ, సతీశ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం తగదు



మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కళిందిని

ముత్తారం: నర్సరీలోని మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం తగదని డీఆర్‌డీవో, మండల ప్రత్యేక ఆఫీసర్ కళిందిని పేర్కొన్నారు. మండలంలోని పారుపల్లిలోని నర్సరీని మంగళవారం ఆమె పరిశీలించారు. మొక్కల ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. మొక్కల సంరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సురేశ్, ఎంపీవో గోవర్ధన్, ఏపీవో దయమణి పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత



నిత్యావసరాలు అందిస్తున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థులు తలా కొంత డబ్బులు జమ చేసుకుని స్ఫూర్తి మానసిక దివ్యాంగ విద్యార్థులకు నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ విద్యార్థులను అభినందించారు. సృజన, స్రవంతి ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత



కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన పోలుదాసరి సాకేత్ వర్మ గుండె సంబంధిత వైద్యం కోసం నిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. వైద్య ఖర్చుల కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు విన్నవించారు. కాగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2.50లక్షల విలువైన ఎల్‌వోసీని సాకేత్ కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన



వేడుకల్లో ప్రత్యేకాధికారి రవీందర్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని టీటీఎస్ అంతర్గాం, ముర్మూర్ గ్రామాల్లో మంగళవారం గ్రామ ప్రత్యేకాధికారి, మండల తహసీల్దార్ తూం రవీందర్ పటేల్ సందర్శించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తుది దశకు చేరిన అభివృద్ధి పనులు, ప్రజావసరాలు తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో కలిసి క్షేత్ర పర్యటన చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజల సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై అభిప్రాయాలు స్వీకరించారు. కార్యదర్శులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆయనను సన్మానించారు. టీటీఎస్ అంతర్గాం పంచాయతీలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. కార్యదర్శులు రవికుమార్, కమల పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంఘాల వినూత్న నిరసన

- బల్దియాలో నల్లబ్యాడ్జీలు ధరించిన ప్రతినిధులు
- శానిటేషన్ వాహనాలకు హారతి ఇచ్చి నిరసన



వాహనాలకు హారతి ఇచ్చి నిరసన తెలుపుతున్న ప్రతినిధులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు మంగళవారం వినూత్నంగా నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించిన ప్రతినిధులు, వినియోగంలోకి రాని శానిటేషన్ కొత్త వాహనాలు, మూలకు పడేసిన బాడీ ఫ్రీజర్లకు హారతి ఇచ్చి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షుడు మంచికట్ల దయాకర్, ప్రతినిధి మద్దెల దినేశ్ మాట్లాడారు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన బాడీ ఫ్రీజర్లు, వాహనాలను మూలన పడేయడం సిగ్గుచేటన్నారు. పారిశుధ్య విభాగంలోని ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలతోపాటు ఇతర వాహనాలకు సకాలంలో మరమ్మతు చేయించకపోవడంతో తరచూ మొరాయిస్తున్నాయి, వాహనాలపై పనిచేస్తున్న డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసి ప్రారంభించిన అధికారులు, వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా అలంకారప్రాయంగా పెట్టారని ఆరోపించారు. పారిశుధ్య కార్మికులకు మూడేళ్లుగా బట్టలు, చెప్పులు, బెల్లం, చీపురు తదితర సామగ్రి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక నిర్వాహకులు గోలివాడ చంద్రకళ, నసిమా, కంది సుజాత, రమా, కొమ్మ చందుయాదవ్, సుద్దాల అణురాజ్, శిరీష, రాజుకుమార్, శెంశర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: అనేక హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ గడిచిన ఏడాదిలో హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రామగుండం ప్రాంతానికి మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయించామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏడాదిగా ప్రజలను మోసం చేసిందన్నారు. మహిళలకు ప్రతీనెల రూ.2,500, వృద్ధులకు రూ.4వేల పింఛన్, రైతుభరోసా, విద్యార్థినులకు స్కూటీలు తదితర హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విమర్శించడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు బాదె అంజలి, కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవిత సరోజిని, కుమ్మరి శ్రీనివాస్, గాదం విజయ, అచ్చె వేణు, చెలకలపల్లి శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, నట్టు శ్రీనివాస్, పిల్లి రమేశ్, మెతుకు దేవరాజ్, ముద్దసాని సంధ్యారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు అండగా సీఐటీయూ పోరాడుతుంది



సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించేందుకు కుట్ర పన్నుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు ఆరోపించారు. విద్యుత్ ఇంజనీర్లు, ఉద్యోగుల పోరాటానికి సంఘీభావంగా మంగళవారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద ర్యాలీ నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల పేరిట డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను ముక్కలు ముక్కలుగా చేసిందని విమర్శించారు. విద్యుత్ ఉద్యోగులకు సీఐటీయూ అండగా ఉండి పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్, చండీగఢ్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో టెండర్లను పిలిచారని, దీనికి వ్యతిరేకంగా అక్కడి ఉద్యోగులు, కార్మికులు నెల రోజులుగా పోరాటాలు సాగిస్తున్నారని తెలిపారు. పోరాటాలను అణచివేసేందుకు కేంద్రం ఎస్మా చట్టాన్ని ప్రయోగించిందన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, నాయకులు రవీందర్, ఖాజా, సాగర్, వెంకటస్వామి, అన్వేష్, శంకర్, అంజయ్య ఉన్నారు.

సైన్స్ ఫెయిర్ సృజనాత్మకతను వెలికితీస్తుంది





విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు

జ్యోతినగర్: నేటి విద్యార్థులే రేపటి సమాజానికి కాబోయే శాస్త్రవేత్తలని, వారిలో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను సైన్స్ ఫెయిర్ ద్వారా వెలికితీయడానికి వీబీ టెక్నో సైన్స్ ఫెయిర్–2024 ఎంతో ఉపయోగంగా ఉంటుందని రామగుండం ఎంఈవో గద్దం చంద్రయ్య అన్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఒకటే ముఖ్యం కాదని, కాలానికి అనుగుణంగా కంప్యూటర్‌తో పోటీపడాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలను ఆయన అభినందించారు. ఎన్టీపీసీ మోడల్, ఓపెన్ కాస్ట్, రిమోట్ కంట్రోల్ కార్, క్లాపింగ్ స్విచ్ ఆఫ్ అండ్ ఆన్ లైట్, చంద్రయాన్ మోడల్ ప్రాజెక్ట్, జేసీబీ హైడ్రాలిక్‌తో పాటు విద్యార్థులు పలు సైన్స్ అంశాలను ప్రదర్శించారు. విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కంది రవీందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు అంజారెడ్డి, సమ్మారావు, హెచ్ఎంలు నోయల్ జోసెఫ్, తిరుపతి, ప్రిన్సిపాల్ ప్రవీణ్, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

సుల్తానాబాద్: ఉచిత కంటి వైద్య శిబిరం శ్రీవాణి జూనియర్ డిగ్రీ కళాశాలలో జనవరి 2న నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ వలస నీలయ్య, అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్ తెలిపారు. కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

• అయ్యప్ప రథయాత్రకు ఏర్పాట్లు

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ సముదాయంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఏటా జనవరి ఒకటో తేదీన మణికంఠుడి రథయాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయ్యప్ప రథయాత్ర కావడిలను అయ్యప్ప మాలధారణ స్వాములు ముస్తాబు చేస్తున్నారు. మణికంఠుడి రథాన్ని సైతం రంగులతో అలంకరిస్తున్నారు. రథయాత్ర ఏర్పాట్లను గురుస్వామి గోపగోని రాములుగౌడ్, ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖరశర్మ పర్యవేక్షిస్తున్నారు.

• విద్యుత్ షాక్‌తో మేక మృతి

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి గ్రామానికి చెందిన ఎనగందుల శంకరయ్యకు చెందిన మేక ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మరణించింది. గ్రామశివారులో మేతకు వెళ్లిన మేక లైశెట్టి సదానందం పొలం వద్ద ఎలాంటి రక్షణ కంచె లేకుండా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌కు తగిలి అక్కడికక్కడే మరణించిందని బాధితుడు శంకరయ్య తెలిపారు.

• ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 33వ డివిజన్‌లోని ఫైవింక్లయిన్ ఏరియాలో మంగళవారం రామగుండం లయన్స్ క్లబ్ సహకారంతో, డివిజన్ ప్రతినిధి బండి రాము ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలతోపాటు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారిని ఉచిత కంటి శస్త్ర చికిత్సల కోసం అప్పటికప్పుడు కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.మల్లికార్జున్, వి.ఎల్లప్ప, జోన్ చైర్మన్ కె.రాజేందర్, సీనియర్ ప్రతినిధులు మేడిశెట్టి గంగాధర్, బంక రామస్వామి, పోకల ఆంజనేయులు, రేకుర్తి హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

• అంగన్వాడీ కేంద్రం నిర్మాణ స్థలం సర్వే

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో అంగన్వాడీ సెంటర్–1 నిర్మాణం కోసం స్థలాన్ని మంగళవారం సర్వే అధికారులు పరిశీలించారు. మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ శ్రీహర్ష ఆదేశాల మేరకు మండల తహసీల్దార్ రామచంద్రరావు ఆధ్వర్యంలో మండల సర్వేయర్ రాధిక గ్రామ పంచాయతీలో కేటాయించిన స్థలంలో అంగన్వాడీ కేంద్రం నిర్మించేందుకు కొలతలు తీసుకున్నట్లు సర్వేయర్ రాధిక పేర్కొన్నారు. మంథని ఐసీడీఎస్, సీడీపీవో పుష్పలత ప్రతిపాదనతో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత, గ్రామ స్పెషల్ ఆఫీసర్ వాసవి, కార్యదర్శి రమేశ్, అంగన్వాడీ టీచర్ పద్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు



తనిఖీ చేస్తున్న సీపీ ఎం.శ్రీనివాస్

గోదావరిఖని: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రామగుండం పోలీస్‌కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో నిర్వహిస్తున్న తనిఖీలను సీపీ పరిశీలించారు. అడ్మిన్ డీసీపీ రాజు, ఏసీపీ రమేశ్, సీఐ ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి

రామగిరి: జేఎన్టీయూ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న బియ్యాన తిరుపతి డిసెంబర్ 28న విజయవాడలో జరిగిన ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి ఆయనను అభినందించారు. శాలువా కప్పి సన్మానించారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ఆహ్వానం అందడం గొప్ప విషయమని, భవిష్యత్‌లో కవి, రచయితగా అనేక పురస్కారాలు అందుకోవాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయండి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఎంఏ.అలీం ఆదేశించారు. అంతర్గాం మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు, కమ్యూనిటీ, ఎవెన్యూ ప్లాంటేషన్ నిర్వహణకు మొక్కల ప్లాంటేషన్‌కు అంచనా, సంరక్షణ బాధ్యతలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఎంపీవో వేణుమాధవ్, ఈజీఎస్ ఏపీవో రమేశ్ ఉన్నారు.

పాఠశాలలో కలర్స్ డే



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు కలర్స్ డే, నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల హెచ్ఎం సౌమ్యవినయ్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు

ఓదెల: మండలంలోని పొత్కపల్లి, ఇందుర్తి గ్రామాలకు చెందిన 25మంది అయ్యప్పస్వాములు శబరిమలకు మంగళవారం తరలివెళ్లారు. పొత్కపల్లి రాజగోపాలస్వామి ఆలయంలో అయ్యప్పస్వాములు ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక బస్సులో శబరిమలకు బయలుదేరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో నరేందర్

కమాన్‌పూర్: మండల కేంద్రంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను మంగళవారం జెడ్పీ సీఈవో నరేందర్ పరిశీలించారు. సర్వేలో జరుగుతున్న లోపాలను సీఈవోకు సిబ్బంది వివరించారు. సర్వేలో వస్తున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. సర్వేను సహకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో లలిత, ఎంపీవో భాస్కర్, కార్యదర్శి రాజ్‌కుమార్ ఉన్నారు.

సింగరేణి వార్తలు

ఉద్యోగ విరమణ సన్మానం



సన్మానిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: క్వాలిటీ డీజీఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కె.అమరేందర్‌రెడ్డిని మంగళవారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయం మీటింగ్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ శాలువాతో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. క్వాలిటీ జీఎం భైద్యా, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజినీర్ డీవీరావు, సీఎంవోఏఐ ప్రతినిధి రాజు, క్వాలిటీ డీజీఎం సాయిప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో హన్మంతరావు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ 2024–25 కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ మంగళవారం అభినందించారు. జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో గోల్డ్ మెడల్ సాధించిన నిహారిక, కార్తికేయ, సాయి కౌశిక్, సిల్వర్ మెడల్ సాధించిన ఎండీ గౌస్, బ్రాంజ్ మెడల్ సాధించిన సంజీవ్‌ను జీఎం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని మెడల్స్ సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో హుయాన్ చుంగ్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ ఎం.రాజేశం, కె.రాములు, గుర్తింపు సంఘం నాయకులు ఆరెల్లి పోషం, ప్రభుదాస్ పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి



సన్మానిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి సంస్థలో ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు అన్నారు. ఆర్జీ–3 ఏరియా సివిల్ విభాగంలో డీవైఎస్ఈగా విధులు నిర్వహించిన నందమూరి రామకృష్ణ దంపతులను మంగళవారం ఉద్యోగ విరమణ సందర్భంగా జీఎం కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. సింగరేణి సంస్థలో 41ఏళ్లుగా రామకృష్ణ ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించారని, అంకితభావంతో అందించిన సేవలు ఆదర్శమన్నారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారి జె.రాజశేఖర్, అధికారులు కె.చంద్రశేఖర్, రాజారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, బి.సుదర్శనం, ఐలయ్య, నాగేశ్వరరావు, ఉదయ్ భాస్కర్, ఉదయ్ హరిజన్, ఆర్.రాజేశ్వరి పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో ప్రతిభ



అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ధర్మారం: మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంఘికశాస్త్రం టాలెంట్ టెస్టులో ఆదర్శ పాఠశాల విద్యార్థులు రమ్యశ్రీ, స్వాతి ప్రతిభ కనబరిచారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్ తెలిపారు. జనవరి 4న పెద్దపల్లిలో నిర్వహించే జిల్లాస్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారన్నారు. వీరిని ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి డాక్టరేట్

మంథని: మండలంలోని కాకర్లపల్లి పాఠశాల ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోట లక్ష్మణ్‌కు తెలుగు భాష, సాహిత్యరంగంలో చేస్తున్న కృషికి గాను అమెరికాకు చెందిన డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ (డీఐయూ) గౌరవ డాక్టరేట్ అందించింది. హైదరాబాద్ బిర్లా సైన్స్ మ్యూజియంలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నాడు.

అన్యాక్రాంత స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ యాకయ్య

ఓదెల: మండలంలోని మడకలో అన్యాక్రాంతం ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దార్ యాకయ్య మంగళవారం పరిశీలించారు. ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గొస్కె రాజేశం ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణు ఎదుట 10ఎకరాల స్థలం అన్యాక్రాంతంపై న్యాయం జరగాలని విన్నవించారు. అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ 506, 510, 492 సర్వే నెంబర్లలో స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో హద్దురాళ్లు వేస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

విజేతకు బహుమతి ప్రదానం

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామం ఆదర్శ నగర్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేత జట్టుకు మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు నగదు బహుమతి అందజేశారు. శివాజీ, అంజి, కొండయ్య, కుమార్, రమేశ్, రఘు, రాకేశ్ పాల్గొన్నారు.



కొత్త సంవత్సరం.. సరికొత్తగా వేడుకలు

జ్యోతినగర్: కొత్త సంవత్సరం అందరూ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటారు. కానీ అందుకు భిన్నంగా కేక్ స్థానంలో వాటర్ మిలన్‌ను కట్ చేసి కొత్త సంవత్సరం వేడుకలను మహిళలు ఆనందంగా జరుపుకున్నారు. మంగళవారం రాత్రి కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని మహిళలు వాటర్ మిలన్ కట్ చేసి కొత్త సంవత్సరాన్ని వినూత్నంగా జరుపుకున్నారు.